

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 11 | ఆదివారం 12, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02


Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



### క్లీన్ పాలిటిక్స్...

## పాజిటివ్ ఓటింగ్

- ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి
- ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలి
- కార్యకర్తల కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్'
- శిక్షణా తరగతుల్లో టిడిపి అధినేత చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 11 : పాజిటివ్ ఓటు పెరగాలని, క్లీన్ పాలిటిక్స్ మన లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ సీనియర్ నేతలతో నేతలు, కార్యకర్తలకు టీడీపీ అధినాయకత్వం శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను సీఎం

2 లో

## జ్యోతిరావు పూలే జయంతి

### - ఘనంగా నివాళి అర్పించిన చంద్రబాబు, మంత్రులు



అమరావతి, ఏప్రిల్ 11 :మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆ మహానుభావుడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఘన నివాళులర్పించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు అని సీఎం చంద్రబాబు అన్నారు. సామాజిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని మంత్రి లోకేశ్ కొనియాడారు. ఆ మహాత్ముని జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం, మంత్రి పోస్టు చేశారు.'మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశాబ్ది జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. సామాజిక విప్లవ పితామహుడు పూలే. కుల వివక్షకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల, మహిళల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు మనకు ఎప్పటికీ ఆదర్శం. ఆయన చూపిన మార్గంలో నడవడం మన సామాజిక బాధ్యత. 'విద్య లేనివాడు వివేకం కోల్పోతాడు, వివేకం లేనివాడు నైతికత కోల్పోతాడు, నైతికత లేనివాడు అభివృద్ధిని కోల్పోతాడు' అని ఆయన చేసిన బోధనలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి' అని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. దళితుల అభ్యున్నతి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన జీవితాంతం కృషిచేశారు. విద్య ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేశారు. ఆయన జయంతిని ప్రజాప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది. సామాజిక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం' అంటూ మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మంత్రి సవిత అన్నారు. మహిళా విద్య, దళిత, బడుగువర్గాలహక్కులకు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు.

### బొత్స కన్నీటి వెనక

## నిజాలు బయటకు రావాలి

### టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర డిమాండ్



గుంటూరు, ఏప్రిల్ 11 : వైసీపీ నేత బొత్స సత్యనారాయణ కన్నీటికి కారణం ఏంటో చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర డిమాండ్ చేశారు. గతంలో బొత్స చేసిన వ్యాఖ్యలను కప్పిపుచ్చుకోవడానికే ఈ కన్నీరు అంటూ ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయినప్పుడు జగన్ రెడ్డి ఎక్కడ ఉన్నారో స్పష్టంగా చెప్పాలన్నారు. ఆ సమయంలో జగన్ రెడ్డి చేసిన చర్యలు, తీసుకున్న నిర్ణయాలు ఏమిటో ప్రజల ముందు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్ మరణం తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు జగన్ రెడ్డికి మాత్రమే లాభదాయకంగా మారాయని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ధూళిపాళ్ల హితవుపలికారు. ఏ రాజకీయ

2 లో

## హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి








విశాఖపట్నం, ఏప్రిల్ 11 :చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగల పూడి అనిత వ్యాఖ్యానించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ అంటే ఒక గౌరవమని ఉద్ఘాటించారు. పోక్సో కేసుల్లో బెయిల్ రాకుండానే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు న్యాయం జరుగు తుందని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం, 1976పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు, 200 మంది ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా

2 లో

### బాలిక హత్యపై

## చంద్రబాబు సీరియస్

### - ఉన్మాదులను వదిలిపెట్టేది లేదని హెచ్చరిక



అమరావతి, ఏప్రిల్ 11: కడప జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి విషయాల్లో నిందితులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. ఖాజీపేట ప్రాంతంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్య ఘటనపై సీఎం సీరియస్ అయ్యారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆడబిడ్డల భద్రత విషయం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.కడప జిల్లా ఖాజీపేటలో రామకీర్తనను(17) వెంకటేశ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. కొంత కాలంగా ప్రేమించాలంటూ బాలికను వేధింపులకు గురిచేశాడు వెంకటేష్. అందుకు బాలిక నిరాకరించడంతో కోపంతో ఊగిపోయిన ప్రేమోన్మాది.. శుక్రవారం బాలిక ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఒంటిరిగా ఉంది.

2 లో

## నాదెండ్ల భాస్కర రావు క్షేమం

- ఆయన ఆరోగ్యంపై పుకార్లు వద్దు
- మంత్రి మనోహర్ కార్యాలయం ప్రకటన

అమరావతి, ఏప్రిల్ 11 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు ఆరోగ్యం గానే ఉన్నట్లు ఆయన కుమారుడు, ఏపీ మంత్రి నాదెండ్ల

2 లో

## మా పోరాటం వల్లనే రైల్వేజోన్ వచ్చింది

### - శిక్ష కేసును హైకోర్టులో సవాల్ చేస్తా: గుడివాడ



విశాఖపట్టణం, ఏప్రిల్ 11:అప్పట్లో రైల్వేజోన్ కోసం పోరాటం చేయడం వల్లే ఇప్పుడు విశాఖకు జోన్ వచ్చిందని వైకాపా నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ కేటాయించాలని కోరుతూ 2016 ఏప్రిల్‌లో అమర్‌నాథ్ ఆందోళనలు నిర్వహించారు. స్థానిక జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఈ ఘటనపై అప్పట్లో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో గుడివాడకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5

2 లో

## బ్రోకర్ దందాలో బెదిరింపులు

### - వీడియోలు తీసి భారీగా వసూళ్లు - మాచర్ల ఉఎస్ఐ సస్పెన్షన్

పల్నాడు, ఏప్రిల్ 11: పోలీసులంటే సమాజానికి రక్షణగా నిలవడంతో పాటు, ఎలాంటి సందర్భం ఎదురైనా ప్రజలకు తామున్నామంటూ రక్షణగా నిలుస్తుంటారు. అలాంటి పోలీసులే గాడి తప్పితే సమాజం ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తాజాగా అలాంటి పనే చేసిన ఓ పోలీసు.. ఆ వృత్తికే కళంకంగా మారాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చివరికి సస్పెన్షన్‌కు గురయ్యాడు. అతను చేసిన పని చూసి డిపార్ట్‌మెంట్ మొత్తం ముక్కున వేలేసుకుంటోంది. మాచర్ల

2 లో

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సంపాదకీయం

## ఆత్మరక్షణలో కాంగ్రెస్ !

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపోయారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది.మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా...ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్‌గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్‌గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగిపారేసిన నాదర్‌గుల్ రైతులు ++రాజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్‌గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపించారు.ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు.ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్‌గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

# చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

### మరోమారు హెచ్చరించిన ట్రంప్

న్యూయార్క్,ఏప్రిల్11 : ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేరెడ్ కుష్నరలు ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. ఇరాన్ ప్రతినిధులు కూడా ఇస్లామాబాద్ వచ్చేశారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

# నాదెండ్ల భాస్కర రావు క్షేమం

మనోహర్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. భాస్కర్ రావు ఆరోగ్యం సరిగా లేదని, ఆస్పత్రిలో ఉన్నారంటూ ప్రసారమాధ్యమాల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. దయచేసి అలాంటి వార్తలు ప్రసారం చేయొద్దని కోరింది.అయితే మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత 10 రోజులుగా ఆసుపత్రిలోనే మాజీ సీఎం ఉన్నారు. వృద్ధాప్య సంబంధిత సమస్యలు తీవ్రమవడంతో వైద్యులు ఆయన్ను ఐసీయూలో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. మల్టిపుల్ ఆర్గాన్స్ దెబ్బతినడం, డయాలసిస్ కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం వచ్చింది. అయితే ఇదంతా అబద్ధమని ప్రకటన విడుదల చేశారు.

## బ్రోకర్ దందాలో బెదిరింపులు

ఏఎస్సై శ్రీనివాసరావుపై సస్పెషన్ వేటు పడింది. విద్యార్థినిలు, మహిళలను వేధిస్తుండడంతో ఉన్నతాధికారులు అతనిపై చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో పర్యాటక ప్రదేశాలకు వెళ్లే విద్యార్థినిలు, మహిళలను ఏఎస్సై శ్రీనివాసరావు టార్గెట్ చేశాడు. . ప్రేమ జంటల వీడియోలు తీసి బెదిరింపులకు దిగేవాడు. అడిగినంత డబ్బు ఇవ్వాలని, ఆపై తన కోరిక తీర్చాలని బెదిరించేవాడు. తాను చెప్పినట్లు వినకపోతే వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ హెచ్చరించేవాడు. మాచర్ల మండలానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ కూడా ఏఎస్సైకు సహకరించాడు. వీడియోలు తీసి శ్రీనివాసరావుకు పంపేవాడు. వీరిద్దరూ కలిసి ఈ దందా మొదలు పెట్టారు. ఇటీవల స్థానిక వ్యాపారి ఒకరు ఓ మహిళతో వెళ్లారు. వారిద్దరు సన్నిహితంగా ఉన్న వీడియోలను తీసి నగదు వసూలు చేశారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉండడం, అతని ఆగడాలు పెరిగిపోవడంతో పాపం పండింది. ఏఎస్సై వీడియోలు సోషల్ మీడియాలో లీక్ కావడంతో వారి దందా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం కాస్తా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో విచారణ చేపట్టి ఏఎస్సై శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించారు.

# బాలిక హత్యపై చంద్రబాబు సీరియస్

దీంతో తనను ప్రేమించాలని బలవంతం చేశాడు వెంకటేశ్. అందుకు కీర్తన నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక గొంతు కోశాడు ఉన్మాది. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి వచ్చి చూడగా కూతురు రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక చనిపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# మా పోరాటం వల్లనే రైల్వేజోన్ వచ్చింది

వేలు జరిమానా విధిస్తూ.. విశాఖపట్నంలోని రెండో అదనపు ప్రధాన న్యాయస్థానం న్యాయమూర్తి వరలక్ష్మి తీర్పు ఇచ్చారు. విచారణ పూర్తవడంతో, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి మాజీ మంత్రికి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. దిగువ న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై హైకోర్టులో అప్పీలుకు వెళ్తానని అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఇది ప్రజల కోసం చేసిన పోరాటమని అన్నారు.

# హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

అనిత మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేది ఈ వర్క్‌షాప్ అని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా 900 మంది పిల్లలను రక్షించామని వివరించారు. వివిధ దేశాల్లో చిక్కుకున్న180 మందిని కూడా రక్షించామని తెలిపారు. పోలీస్ శాఖలో కూడా నూతన టెక్నాలజీతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పోలీస్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే.. ప్రజాస్వామ్యం పటిష్ఠంగా ఉంటుందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## బొత్స కన్నీటి వెనక నిజాలు బయటకు రావాలి

పార్టీ అయినా సిద్ధాంతాలు, విలువల ఆధారంగా పని చేయాలని స్పష్టం చేశారు. రాజకీయాల్లో హింసాత్మక చర్యలు సరికాదని హెచ్చరించారు. వైఎస్ చనిపోయినా, వివేకా చనిపోయినా, కోడి కేసు అయినా అన్నీ జగన్ రెడ్డికి మాత్రమే లబ్ధి చేకూర్చాయని వ్యాఖ్యానించారు. వైసీపీ విధ్వంసకర పోస్టులపై హైకోర్టులు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని ధూళిపాళ్ల నరేంద్ర పేర్కొన్నారు.

# క్లీన్ పాలిటిక్స్..పాజిటివ్ ఓటింగ్

పంచుకున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేశారు. జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే మావిగన్ ప్రకటనలకు ప్రజలే సమాధానం చెబుతారు. అభివృద్ధి అనేది ఒకచోట ఆగేది కాదు. హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు, ఐటీ రంగం ఆదాయాన్ని పెంచాయి. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉంది. అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుందని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి ఇ3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించారు. 'క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరగాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నేతలకు తెలియజేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల కోసం ఇ3 ప్రొగ్రాం తీసుకొస్తామని చెప్పారు. నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్' కార్యక్రమం చేపడతామన్నారు. 'నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచన చేశానో... టీడీపీ కుటుంబం కోసం అదే విధంగా ఆలోచన చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



# మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు కృషిచేద్దాం

### - నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.కృష్ణమూర్తి

### - ఎంఈఓ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు

మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సామాజిక విప్లవ కారుడు,మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.శనివారం నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాని ముఖ్య అతిథిగా ఏంఈఓ ప్రభాకర్ రెడ్డి,రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మౌలాలి,బివైఎస్ అధ్యక్షులు పునీత్,హెచ్.ఎం రఘు,యుటిఎఫ్ నాయకులు సుధాకర్,టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధి సురేంద్రలు హాజరయ్యారు.ఇందులో భాగంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి,ఆయన చేసిన సామాజిక సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో అణగారినవర్గాల విద్యాభివృద్ధికి,మహిళా సాధికారతకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.చదువు ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మిన మహనీయుడు పూలే అని,ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.పట్టణంలోని ప్రధాన కూడలిలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్థలాన్ని కేటాయించడంతోపాటు పలు పాఠశాలలకు,పార్కులకు పూలే పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.అంతేకాకుండా బిసి భవనాన్ని నిర్మించి దానికి కూడా మహాత్ముని పేరు పెట్టాలని కోరారు.అదేవిధంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బివైఎస్ ప్రతినిధులు,విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా



పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పరిధిలోని పుల్లంపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల సేవా సమితి గౌరవ అధ్యక్షుడు రాజుపోయిన దేవరాజు, పుల్లంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిగమాల రమేష్, రైల్వే కోడూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసల బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు. ఈ సందర్భంగా శాంతయ్య మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే దేశ సామాజిక సంస్కరణలకు, విద్యా విస్తరణకు, కుల నిర్మూలనకు చేసిన అపూర్వ సేవలను స్మరించుకున్నారు. సమాజంలో అక్షరాస్యతను ఆయుధంగా మార్చి అసమానతలపై పోరాటం చేసిన మహానుభావుడిగా, మహిళా సాధికారత కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్తగా ఆయనను కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెప్పల రామ్మోహన్ (మహాసేవ సమితి కార్యదర్శి), రాజంపేట మండల బడుగు బలహీన వర్గాల సేవాసమితి అధ్యక్షుడు రవిచంద్ర, చిట్వేలు మండల అధ్యక్షుడు పాలూరు కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మహాత్మ పూలే జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగు దినపత్రిక


# అణగారిన వర్గాల ఆత్మబంధువు జ్యోతిరావు పూలే

**- ఆ మహనీయుడికి భారతరత్న ప్రకటించాలి**

**- బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్**






?మదనపల్లె (ప్రజా సీమ) : అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి మహాత్మా జ్యోతిరావు పూలే ప్రతీక అని,కేంద్ర ప్రభుత్వం ఆ మహనీయుడికి భారతరత్న ప్రకటించాలని బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్ డిమాండ్ చేశారు.శనివారం స్థానిక టమోటో మార్కెట్ యార్డు వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నా.ఇందులో భాగంగా బోడెం రాజశేఖర్ ఆధ్వర్యంలో మహాత్మా నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి,అణగారిన వర్గాల విద్యా వికాసానికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.దేశ సామాజిక విప్లవ పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలేకు దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు.పూలే ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని,బీసీల హక్కుల కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.పేద బడుగు బలహీన వర్గాలకు విలువలను సమకూర్చిన గొప్ప మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు వై.వి శేఖర్ నాయుడు,నాగినేని గోవిందు,కరామత్ భాష, రామలింగయ్య,చౌడం రామాంజనేయులు,మహేష్,రామ్మోహన్, శివ,శ్రీనివాసులుచంద్రయ్య,సుబ్రహ్మణ్యం,వెంకటేష్,చిన్న రెడ్డప్ప, లక్ష్మీనారాయణ,రమణ,గఫూర్ బాషా,శీను,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూలే గొప్ప సంఘ సంస్కర్త, విప్లవజ్యోతి

**- కాంగ్రెస్ నేత తులసిరెడ్డి**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక విప్లవ జ్యోతి అని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం పూలే ద్విశత జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తులసి రెడ్డి మాట్లాడుతూ అస్పృశ్యత, అంటరానితనం ఎక్కువగా ఉన్న రోజుల్లోనే వీటి నివారణకు పూలే నిర్విరామ కృషి చేశారన్నారు. స్త్రీలు, అణగారిన వర్గాల ఉద్ధరణకు నిరంతరం శ్రమించారన్నారు. భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి పుణేలో తొలి మహిళా పాఠశాలను నెలకొల్పారని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. అలాగే వితంతు వివాహాలను ప్రోత్సాహించారని, పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తులసిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డా.సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్, ఉత్తన్న, బండారు వెంకటేష్, వినయ్, సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే కు ఘన నివాళులు



రైల్వే కోడూరు (ప్రజాసీమ) : రైల్వేకోడూరు టౌన్ ప్రభుత్వ హాస్పిటల్ ప్రాంగణంలో ఉన్న కీర్తిశేషులు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి కోడూరు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిహెచ్ రమేష్ బాబు, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి మందల నాగేంద్ర ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మాజీ సర్పంచ్ బుడిగి శివయ్య, తన్నీరు రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి, యనమల మహేష్, ఆంజనేయులు, ఎంపీటీసీ బత్తిన ఆనంద యాదవ్ ,మాజీ ఎంపీటీసీ. కోడూరు పట్టణ వైసీపీ ప్రధాన కార్యదర్శి సింగమాల రాజగోపాల్, పగడాలపల్లి వైసిపి ఇన్చార్జ్ బొంపల్లి నాగరాజా సభ్యులు. సింగమాల వినోద్ కన్నా వార్డు సభ్యులు.ఇరగబోయిన నాగేశ్వర యాదవ్ మాజీ వార్డు సభ్యులు.. వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి లక్ష్మయ్య, ఉర్లగడ్డల చంద్రశేఖర్. వైసీపీ బీసీ కార్యదర్శి కొర్లకుంట శంకరయ్య పాల్గొన్నారు.

# సాంకేతికతపై పట్టుసాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

**- శ్రీజ్ఞానాంబిక విద్యాసంస్థల అధినేత రాటకొండ గురుప్రసాద్**

**- విద్యోదయ పాఠశాలలో ఆకట్టుకున్న స్టెమ్ ఎక్స్ పో**






మదనపల్లె (ప్రజా సీమ) : విద్యార్థులు పాఠశాల దశ నుండే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శ్రీజ్ఞానాంబిక విద్యాసంస్థల అధినేత డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ పేర్కొన్నారు.శనివారం పట్టణంలోని నిమ్మనపల్లి రోడ్డు నందు గల విద్యోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు గ్రాండ్ యాన్యువల్ స్టెమ్ ఎక్స్ పో ఘనంగా నిర్వహించారు.రాటకొండ గురుప్రసాద్,ఎంఈఓ ప్రభాకర్ రెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరై ఈ ఎక్స్ పోని ప్రారంభించారు.ముందుగా అతిథులకు పాఠశాల కరస్పాండెంట్ పొత్తూరి శ్రీనివాసులు నాయుడు,డైరెక్టర్,ప్రిన్సిపాల్ ఝాన్సీ లక్ష్మీలు అపూర్వ స్వాగతం పలికారు.ముందుగా విద్యార్థులు రూపొందించిన రోబోట్ వైజ్ఞానిక ప్రదర్శనలను క్షుణ్ణంగా పరిశీలించి,వాటి ఉపయోగాల గురించి విద్యార్థుల వివరణలను ఆసక్తిగా ఆలకించారు.ఈ సందర్భంగా రాటకొండ గురు ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రస్తుతం విద్యార్థులు విద్యతోపాటు సాంకేతిక విధానాలపై దృష్టి సారించాలన్నారు.మదనపల్లి చరిత్రలోనే ది రోబోట్ కంపెనీ సహకారంతో విద్యోదయ పాఠశాల యాజమాన్యం స్టెమ్ ఎక్స్ పో ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు.అదేవిధంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు చాలా అద్భుతంగా ఉన్నాయని,ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఎక్స్ పోలు ఏర్పాటు చేసి ఈ ప్రాంతం నుంచి విద్యార్థులు మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని,తద్వారా మదనపల్లి కీర్తిప్రతిష్టలను జాతీయస్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.భవిష్యత్తు ఏఐ,రోబోటిక్ రంగాలదేనని ఆయన స్పష్టం చేశారు.అనంతరం పాఠశాల యాజమాన్యం శ్రీనివాసులు నాయుడు,ఝాన్సీ లక్ష్మీలు మాట్లాడుతూ మా పాఠశాలలో నాణ్యమైన విద్య బోధనతోపాటు సాంకేతిక విద్య,సాంస్కృతిక కార్యక్రమాలు,సామాజిక స్పృహపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ది రోబోట్ ఈడి కంపెనీతో తాము అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని,దీని ద్వారా ఏఐ,రోబోటిక్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.3వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల నమూనాలను రూపొందించడం గర్వకారణమన్నారు. చివరగా రోబోట్ ఈడి కంపెనీ సిఈఓ జక్రియా మాట్లాడుతూ తమ సంస్థ విద్యోదయ పాఠశాలతో అవగాహన ఒప్పందం చేసుకొని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.ఏడాది కాలంలోనే విద్యార్థులు ఏఐ,రోబోటిక్ అంశాలపై ఎంతో పట్టు సాధించారని,ఎక్స్ పోలో 51 ప్రాజెక్టులను తయారు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు.భవిష్యత్తులో మరిన్ని ఎక్స్ పోలు నిర్వహించి సమాజానికి ఏఐ,రోబోట్ ఆవశ్యకతను తెలియజేస్తామన్నారు.ఇందుకు సహకారం అందించిన విద్యోదయ పాఠశాల యజమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ది రోబోట్ ఈడీ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ బాబీ,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏఐ,డేటా,క్లౌడ్ సాంకేతికతలపై విద్యార్థులు పట్టుసాధించాలి

**- మిట్స్ యూనివర్శిటీలో అతిథి ఉపన్యాసం**

**- హాజరైన సీనెట్రిక్ గ్లోబల్ సిడిఓ లలిత్ కుమార్ యాగ్నిక్**






కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజి నీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్) విభాగం వారు ఏఐసిటిఈ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) న్యూఢిల్లీ వారి సహకారంతో నాలెడ్జ్ అండ్ స్కిల్స్ ఫర్ ది ఏఐ-డ్రివెన్ వరల్డ్ అనే అంశంపై శనివారం అతిథి ఉపన్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనెట్రిక్ గ్లోబల్,బెంగళూరు-సింగపూర్ సంస్థకు చీఫ్ డిజిటల్ ఆఫీసరుగా పనిచేస్తున్న లలిత్ కుమార్ యాగ్నిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేటి యుగంలో కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా మానవ జీవన విధానాన్ని,పరిశ్రమలను మరియు విద్యా వ్యవస్థను సమూలంగా మార్చుతున్న శక్తిగా నిలుస్తోందన్నారు.ఐబీఎంలో దాదాపు 30 సంవత్సరాలపాటు ఆస్ట్రేలియా,ఆసియాన్,భారతదేశం,అమెరికా వంటి ప్రపంచ మార్కెట్లలో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ,భవిష్యత్తులో విజయం సాధించాలంటే విద్యార్థులు ఏఐ,డేటా మరియు క్లౌడ్ సాంకేతికతలపై పటిష్టమైన పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే భారతదేశంలో విద్యా వ్యవస్థను ఏఐ యుగానికి అనుగుణంగా పునర్నిర్మించడం,నేర్చుకునే విధానాలు,ఉద్యోగావకాశాలు మరియు ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం దిశగా కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు పరిశ్రమ నిపుణులతో ప్రత్యక్షంగా మమేకమయ్యే అవకాశాన్ని కల్పిస్తూ వారి కెరీర్ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మ,కో-ఆర్డినేటర్లు తారకేశ్వర రాజు.బి మరియు వి.శివరామన్,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

**తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**



రాజంపేట(ప్రజా సీమ) : స్వతంత్రం రాకముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 200 వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పార్టీ ముఖ్య నాయకులతో కలిసి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఘనంగా నివాళులు అర్పించారు.మహాత్మ జ్యోతిరావు పూలే గారిని స్ఫూర్తిగా తీసుకొని,వారి ఆశయాల సాధనకు,వారి అడుగుజాడల్లో నడవాలని చమర్తి జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ నాగరికత లేని రోజుల్లోనే జ్యోతిరావు పూలే జీవితమంతా బలహీన వర్గాల ప్రజలకు అంకితం చేశారన్నారు. ఆనాడు స్త్రీలకు స్వేచ్ఛ ఉండేది కాదని,తరతరాలుగా అణిచివేతకు గురయ్యారన్నారు.స్త్రీలు కూడా చదువుకుంటే పురుషులతో సమానంగా రాణించగలరని ఆ రోజుల్లో బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత జ్యోతిరావు పూలేదేనని చమర్తి జగన్ మోహన్ రాజు కొనియాడారు.అదేవిధంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయులు జ్యోతిరావు పూలే అని,అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం యనలేని కృషి చేశారని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారతదేశ మహిళా విద్య పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే



పీలేరు (ప్రజా సీమ) : మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా పీలేరు పట్టణంలో నేడు బీసీ హక్కుల పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎద్దుల మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, జాతీయ చేనేత రాష్ట్ర అధికార ప్రతినిధి పోలిశెట్టి సురేంద్ర( చేపల సూరి), ఏపీ ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర హాజరై స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణ నందు ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వీరు మాట్లాడుతూ లిభారతదేశ మహిళ విద్య పితామహుడు, ఆధునిక యుగ వైతాళికుడు, దేశ ప్రప్రథమ సామాజిక తత్వవేత్త, గాంధీ కంటే ముందే మహాత్ముడిగా జన నిరాజనాలందుకున్న విశిష్టమూర్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని వీరు కొనియాడారు. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు ,వివక్షతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడిన తీరు అమోఘమని అదేవిధంగా 1848 వ సంవత్సరంలో భారత దేశంలోనే మొట్ట మొదట పూణేలో బలహీనవర్గాల కులాల బాలికల కోసం జ్యోతిరావు పూలే పాఠశాలను స్థాపించి మహిళా విద్యకు మార్గదర్శకుడయ్యాడని 1864 వ సంవత్సరంలో గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి వితంతువుల గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచి, వితంతు పునర్ వివాహాలను ప్రోత్సహించారని, భారతీయ మాజంలో సామాజిక సంస్కరణ మరియు సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేని, తన జీవితాంతం అసమానతలు లేని సమ సమాజ స్థాపన కోసం పరితపించిన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజల గుండెల్లో ఎల్లప్పుడు నిలిచి ఉంటారని వీరు తెలిపారు. ప్రపంచంలోనే రెండు శరీరాలు ఒకే ఆలోచన విధానంతో తమ తుది శ్వాస వరకు మానవ మార్పుకు కృషి చేసిన దంపతులు ఎవరైనా ఉన్నారంటే అది మహాత్మ జ్యోతిరావు పూలే ,సావిత్రి పూలే దంపతులేనని కావున రాష్ట్ర ప్రభుత్వం బీసీ రక్షణ చట్టం అమలు చేసి బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని కల్పించి చట్టసభల్లో వారి శాతాన్ని పెంచాలని వీరు డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని వీరు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చెన్నారెడ్డి కాలనీ హరి, వసంతాల రాజా , ప్రభాకర్ రాజు , అబ్బవరం సురేష్ ,మహిళా నాయకురాలు శివయోగి సుధారాణి , గొల్ల కృష్ణం నాయుడు , విశ్రాంత అధ్యాపకులు రాధాకృష్ణ , చంద్రయ్య , భాస్కర్ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేశావళి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అదుపులో గంజాయి ముఠా

## - నలుగురు అరెస్ట్ : రూ.లక్ష విలువైన గంజాయి స్వాధీనం
## - అదనపు ఎస్పీ వెంకటాద్రి వెల్లడి



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె పరిసర ప్రాంతాల్లో గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను తాలూకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.రెండునెలల క్రితం ఉల్లిపాయల లోడ్ కింద భారీఎత్తున గంజాయిని తరలిస్తున్న పాత కేసులో పరారీలో ఉన్న నలుగురు ముద్దాయిలను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి రూ. 1,00,000 విలువైన 4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి శనివారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ సిబ్బందితో కలిసి శనివారం బసినికొండ పంచాయతీ పరిధిలోని కనుమలో గంగమ్మ గుడి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.ఈ క్రమంలో పుంగనూరు వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు దిగి,అనుమానాస్పదంగా నల్లటి కవర్లతో పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు పురుషులు,ఇద్దరు మహిళలను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్‌లో గతంలో నమోదైన 179 కేజీల గంజాయి స్మగ్లింగ్ కేసులో వీరంతా పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.పట్టుబడిన వారిలో సత్యసాయి జిల్లా తనకల్లు మండలానికి చెందిన మల్లెల మహేష్,మల్లెల అమరావతి,పుంగనూరు పట్టణానికి చెందిన మల్లెల రాజమ్మ,మల్లెల చంటి ఉన్నారు.నిందితుల నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని,వారిని రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులో ప్రధానంగా గంజాయి విక్రయించిన మరో నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు,రవాణా,విక్రయాల మీద ఉక్కుపాదం మోపుతున్నామన్నారు.ముఖ్యంగా యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్న ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచామని,గంజాయి విక్రేతలపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తామని హెచ్చరించారు.జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని,అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.సమర్థవంతంగా పనిచేసి నిందితులను పట్టుకున్న మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# వై కోటలో ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ముక్కా వరలక్ష్మి








రైల్వేకోడూరు( ప్రజా సీమ) :తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం వై .కోట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ వారి ఆర్థిక సహకారంతో వారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్యూరిఫైడ్ స్వచ్ఛమైన త్రాగునీటి సదుపాయాన్ని ప్రజలకు అందించడం జరిగింది. ఇటువంటి బృహత్తర కరమైన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వేకోడూరు నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మరియు రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి సంయుక్తంగా పాల్గొని ప్రజలకు స్వచ్ఛమైన నీరుని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరవ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అనేది చాలా అవసరం అయినా విషయం ప్రస్తుత పరిస్థితులలో నీటి ప్రాముఖ్యత చాలా ఉంది ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని దృఢ సంకల్పంతో ఉన్నటువంటి ఏపీఎండీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో ఆర్ ఓ ప్లాంటులను ప్రారంభించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించారు. అంతేకాకుండా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూలి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరు స్వచ్ఛమైన నీరు తాగుతూ తమ ఆరోగ్యాలని కాపాడుకోవాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రజలందరికీ స్వచ్ఛమైన నీరు అందించాలని ఒక మంచి సంకల్పంతో కూటమి ప్రభుత్వం అండదండలతో ఏపీఎండిసి వారి సహాయ సహకారాలతో ముందుకు వెళ్తున్నామని ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు అండదండలుగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నాగిరెడ్డి రాజేంద్రప్రసాద్ రెడ్డి


## - పార్టీ బలోపేతానికి బూత్ లెవెల్ లో కృషి చేస్తా
## - మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వం మళ్లీ రావాలి



చిట్వేలి(ప్రజా సీమ) : వైసిపి పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా వైసీపీ అనుబంధ విభాగాల కమిటీలో బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా చిట్వేలి మండల వాసి నాగిరెడ్డి రాజేంద్రప్రసాద్ రెడ్డి, నియమితులయ్యారు. ఆ పార్టీ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, తెలిపారు. ఈ మేరకు శనివారం, రాజేంద్రప్రసాద్ రెడ్డి, మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, ఎంపీ మిధున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసరెడ్డి, అన్నమయ్య జిల్లా యూత్ వింగ్ అధ్యక్షులు వై. శివప్రసాద్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకానికి విధేయుడుగా పనిచేస్తూ, పార్టీ ఎదుగుదలకు తను వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపితం చేస్తూ జగన్మోహన్ రెడ్డి ,నాయకత్వం లో రాష్ట్రం సుభిక్షంగా పాలన సాగాలని ఆకాంక్షతో సిద్ధాంతాలను పాటిస్తూ ప్రజల పక్షాన నిలిచి మళ్లీ సుపరిపాలన వచ్చేలా మా వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. మా పైన పెట్టుకున్న నమ్మకాన్ని ప్రజల్లో చైతన్యం తీసుకువస్తూ ముందుకు వెళదామని ప్రజాక్షేత్రంలో పార్టీని బలోపేతం దిశగా తీసుకువెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

# బహుజనుల బాంధవుడు మహాత్మ జ్యోతిరావు పూలే

## గండికోట వెంకటేష్ ఎమ్మార్పీఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్



పీలేరు(ప్రజా సీమ) : బడుగు బలహీన వర్గ బహుజనుల బాంధవుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఆయనకు భారతరత్న అవార్డు ప్రకటించాలని ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేశ్ పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే 199 వ జయంతిని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పీలేరు మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహ ప్రతిమకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక యుగవైతాళికుడు దేశ ప్రథమ సామాజిక తత్వవేత్త , భారతదేశ మహిళ విద్యా పితామహుడు,గాంధీ కంటే ముందే మహాత్ముడిగా జన నీరాజనం అందుకున్న పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని, భారత దేశంలో సామాజిక సంస్కరణ సమానత్వం కోసం వారు చేసిన కృషి వెలకట్టలేనిది తుది శ్వాస వరకు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడినయోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి పీలేరు మండల అధ్యక్షులు ఇంగ్లే బాలసుబ్రమణ్యం, ఎంఆర్పిఎస్ కెవిపల్లి మండల అధ్యక్షులు సందిపోగల రాము, విహెచ్పిఎస్ పీలేరు మండల అధ్యక్షులు మచ్చ వెంకటేష్, ఎంఎస్పి సీనియర్ నాయకులు రాచ పల్లి వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ యువ నాయకులు లక్ష్మీ నరసింహ, వంగళ్ల రాజేష్, రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే జీవితం ఆదర్శప్రాయం

## - జనసేన నేత దాసరి రవిశంకర్ - చిత్రపటానికి ఘన నివాళులు



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జనసేన సీనియర్ నేత డా.దాసరి రవిశంకర్ అన్నారు. శనివారం పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, అంటరానితనం నిర్మూలనకు జ్యోతిరావు పూలే కృషి ఎనలేనిదన్నారు. అణగారిన వర్గాల హక్కులకు జీవితాంతం పోరాడారని గుర్తు చేశారు. అలాగే మహిళా విద్యకు, సమానత్వ సమాజ నిర్మాణానికి చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, కృష్ణ మోహన్, గంగన్న, జగన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆర్ యు బి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

## - ఎమ్మెల్యే తో పాటు పనులను పరిశీలించిన డిఆర్యుసిసి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి








రాజంపేట(ప్రజా సీమ) : కడప జిల్లా రాజంపేటలోని 103 ఆర్ యు బి పనులను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మరియు డి ఆర్ యు సి సి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి లు సంయుక్తంగా కలసి పనులను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేసి పాదచారులకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే మరియు డిఆర్యుసిసి సభ్యులు డిఆర్ఎం ను కలిసి ఆర్ యు బి ని పూర్తి చేయాలని కోరడం జరిగిందని తద్వారా పాదచారులు నడిచి వెళ్లేందుకు మార్గం సుగమవుతుందని తెలపడంతో పనులను ప్రారంభించడం జరిగిందని, జరిగేటటువంటి పనులను శనివారం పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

# కన్నుల పండువగా సీతారామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం









వీరబల్లె,(ప్రజా సీమ) :ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా వర్ధిల్లాలని నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆకాంక్షించారు. శనివారం నాడు వీరబల్లె మండలం,మట్లి గ్రామం,నాయునివారి పల్లె నందు పర్యటిస్తూ నూతన సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆలయ నిర్వాహకుల ఆహ్వానంమేరకుచమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు గ్రామీణ సంస్కృతిని సాంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని జగన్ మోహన్ రాజు వడ్డించారు. అంతకుముందు గ్రామంలో పర్యటించిన చమర్తి జగన్ మోహన్ రాజు కి అలయ నిర్వాహకులు,గ్రామస్తులు,నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే కు నివాళులర్పించిన ముక్కా రూపానంద రెడ్డి







రైల్వేకోడూరు (ప్రజా సీమ) :రైల్వే కోడూరు టిడిపి పార్టీ ఆఫీస్ నందు నిర్వహించిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో చిత్రపటానికి పూలమాలవేసి ముక్కా రూపానంద రెడ్డి నివాళులర్పించారు. సమాజంలో సమానత్వం, స్త్రీ విద్యా కోసం జీవితకాలం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రైల్వే కోడూరు క్యాంప్ కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప సంస్కర్త. విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమని నమ్మి అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. మహిళల విద్య, హక్కుల కోసం చేసిన ఆయన సేవలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయి. అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

## స్టేట్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు



సిద్ధవటం( ప్రజా సీమ) : శనివారం ఉదయం కడప కలెక్టర్ గారి కార్యాలయంలో ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించిన మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జన్మదిన వేడుకలకు జిల్లా కలెక్టర్ శ్రీ చెరుకూరి శ్రీధర్ ఆహ్వానం మేరకు ప్రోటోకాల్ ప్రకారం జిల్లాలోని పలువురు బీసీ స్టేట్ డైరెక్టర్లు, అధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ భాషా/దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ డైరెక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ భారత సామాజిక విప్లవకారుడు కుల వివక్ష రూపుమాపేందుకు మరియు మహిళల అభివృద్ధి విద్యతోనే సాధ్యమని తన ఈ ఆశయం కోసం తన జీవితాన్నే త్యాగం చేసి, తన సతీమణి సావిత్రిబాయి పూలే గారికి ఆయనే విద్యాభ్యాసం చేపించి ఆమెను మొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దడమే కాక తద్వారా 1848 పూణేలో మహిళలకు మొట్టమొదటి విద్యాలయంను ఏర్పాటు చేసి అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని సమాజానికి చాటి చెప్పిన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే గారు ని, విద్య లేక పోతే మతి తప్పుతుందని మతి లేకపోతే గతి తప్పు తుందని గతి లేకపోతే సమాజ అభివృద్ధి ఉండదని భావించి తన విప్లవ కార్యక్రమంల ద్వారా విద్యను సమాజానికి అందించవలసిన అవసరాన్ని ముందుకు తీసుకువెళ్లడమే కాక గులాంగిరి, రైతు బిడ్డ, సర్వజనిక్ సత్య ధర్మ లాంటి పుస్తకాలు రచించి సమాజంలో అస్పృశ్యత అంటరానితనం రూపుమాపడానికి పూలే గారు ఎంతో కృషి చేశారు అని చెప్పారు. మహాత్మ జ్యోతిరావు పూలే గారి 200 వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ భవన్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంలో బిసి రాష్ట్ర డైరెక్టర్ హోదాలో ఇంతటి చక్కటి అవకాశాన్ని కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి మరియు ఐటి విద్యా శాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారికి, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బిసి వెల్ఫేర్ శాఖ మంత్రివర్యులు శ్రీ సవిత మేడం గారికి మా నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ చమర్తి జగన్మోహన్ రాజు గారికి ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధికారులు గౌరవ జాయింట్ కలెక్టర్ శ్రీమతి నిధి మీనా ఐఏఎస్ గారు, ఐ=హా మల్లికార్జున గారు, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అదనపు అధికారి సరస్వతమ్మా గారు, బీసీ కార్పొరేషన్ జుఐ జయసింహా గారు, జిల్లాలోని బీసీ క్యాస్ట్ స్టేట్ డైరెక్టర్లు, బీసీ కులాల వివిధ సంఘాల పెద్దలు మరియు జిల్లాలోని బ్యాక్వర్డ్ క్లాస్ ముఖ్య నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది మొదలగు వారు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# కోమటివానిచెరువు సుందరీకరణకు చర్యలు

## - పిచ్చిమొక్కలు తొలగింపుకు నిధులు కేటాయింపు

## - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా వెల్లడి



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణం నడిబొడ్డున ఉన్న కోమటివాని చెరువును లక్షల రూపాయలు ఖర్చు చేసి వారం రోజులుగా పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. నేడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా కోమటివాని చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం జెసిబిలతో నిర్వహిస్తూ లక్షల రూపాయలు మున్సిపల్ నిధులను ఖర్చు చేయడం జరుగుతోందని,మదనపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో భాగంగా కోమటివానిచెరువు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. త్వరలో చెరువు ప్రాంతాన్ని శుభ్రం చేసి బోటింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు నవీన్ చౌదరి,రామిశెట్టి కృష్ణ (కమలామర్రి),కంచెర్ల మల్లికార్జున నాయుడు,మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల విందుగా సీతారామ కళ్యాణ మహోత్సవం



పుల్లంపేట ప్రజాసేమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో అనంతంపల్లి పంచాయతీలోని చాపల హెచ్ డబ్ల్యు గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతముగా జరిగినది, గ్రామము సుభిక్షంగా గ్రామ ప్రజలు ఆనందదాయకంగా ఉండాలని శ్రీరామచంద్రుని ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని వేద పండితులు ఆశీర్వదించడం జరిగింది రామాయణంలోని ఆదర్శ నువ్వు రాముడి గుణాలను ప్రజలకు గుర్తు చేయడం ఈ ఉత్సవాల ఉద్దేశమన్నారు ,స్వామి వారిని చూసినప్పుడు ఆయన నడిచిన ధర్మ మార్గము అందరికీ స్మరణకు వస్తుందని వేద పండితులు తెలిపారు కళ్యాణ వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదా లు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది సాయంకాలం గ్రామసభ కార్యక్రమాలలో భాగంగా చెక్కభజన కార్యక్రమం గ్రామంలో ఎంతో ఆహ్లాదకరంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం కార్యక్రమం న ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామంలో భక్తులు చెక్కభజన బృందం వారు మొదలవారు పాల్గొన్నారు

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే

## - కులవ్యవస్థ నిర్మూలన,స్త్రీ విద్యకు పాటుపడిన మహనీయుడు

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,ఎమ్మెల్యే షాజహాన్ బాషా





మదనపల్లె (ప్రజా సీమ) : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సామాజిక అసమానతలను రూపుమాపేందుకు జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అడుగుజాడలే స్ఫూర్తిగా పయనిద్దామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.శనివారం ఉదయం మదనపల్లి కలెక్టరేట్లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి కలెక్టర్,మదనపల్లి శాసన సభ్యులు షాజహాన్ బాషా,డిఆర్ఓ మధుసూదన్ రావు,అధికారులు,వివిధ బిసి సంఘ నాయకులు,ప్రతినిధులు పూలమాలు పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సామాజిక సంస్కర్త,విద్యా సంచాలకుడు మరియు సమానత్వ పోరాట యోధుడన్నారు.అలాగే 1848లో భారతదేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించడం ద్వారా మహిళా విద్యకు నూతన దిశను చూపారని చెప్పారు.ఆ కాలంలో మహిళా విద్యపై ఉన్న అపోహలు,భయాలను తట్టుకుని ముందుకు సాగడం ఆయన ధైర్యసాహసాలకు నిదర్శనమన్నారు.వితంతువుల పునర్వివాహం, వితంతువుల విద్య,వారి గౌరవప్రదమైన జీవనం కోసం తీసుకున్న చర్యలు ఆ కాలంలో విప్లవాత్మక సంస్కరణలుగా నిలిచాయని పేర్కొన్నారు.కులవివక్ష వంటి సమస్యలు సమాజాన్ని విభజించే ప్రమాదకర అంశాలని గుర్తించి,సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన పునాది వేశారని తెలిపారు.సమాజంలోని ప్రతి వర్గం సమానంగా జీవించే హక్కు కలిగి ఉందనే సందేశాన్ని ఆయన విస్తృతంగా ప్రచారం చేశారని,ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలన,స్త్రీ విద్యకు పాటుపడిన మహనీయుడన్నారు.విద్య సమాజ అభివృద్ధికి ప్రధాన ఆయుధమని పూలే విశ్వసించారని,ప్రతి ఒక్కరు విద్యను పొందేలా చేయడం ద్వారా సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన నిరూపించారని పేర్కొన్నారు.అప్పటి ప్రతికూల పరిస్థితుల్లో విద్య కోసం పోరాడటం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు.సమానత్వం, విద్య,సామాజిక న్యాయం,మహిళా సాధికారత వంటి విలువలను సమాజంలో మరింతగా వ్యాప్తి చేయాలని కోరారు.వారి ఆశయాలు ప్రతి తరానికి మార్గదర్శకమని,వాటిని కొనసాగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. చంద్రశేఖర్ రెడ్డి,బీసీ సంక్షేమ శాఖ అధికారి తేజస్విని,సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ఎం.పర్వీన్ తాజ్,జంగం కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భావన,పాలఏకరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడు,బీసీ సంఘం నాయకులు బోడెం రాజశేఖర్,గంగులప్ప,సుబ్రహ్మణ్యం,ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు ఆదర్శనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే

## - యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ ప్రశంసలు





మదనపల్లె (ప్రజా సీమ) : మహాత్మ జ్యోతిరావు పూలే భావితరాలకు ఆదర్శనీయుడని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ పేర్కొన్నారు.మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని యూటీఎఫ్ పట్టణ సమితిచే నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్ యార్డు వద్ద ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పురం వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి సంఘసంస్కర్త బడుగు,బలహీన వర్గాల సమానత్వం కోసం కులవివక్షతను పోగొట్టుటకు,భారతదేశానికి మొదటి మహిళా ఉపాధ్యాయుని సావిత్రి భాయ్ పూలేని సమాజానికి అందించి తన యావత్తును సమాజం కొరకు దారపోసిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే అని తెలిపారు.అంటరానితనం, కులవివక్షత, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు పాటుపడిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా ఆయన జయంతికి పాఠశాలలకు,ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థలకు సెలవు ప్రకటించాలన్నారు.ప్రతి పట్టణ,మండల కేంద్రాలలో ఈ మహనీయుడు విగ్రహాలు ఏర్పాటు చేయాలని, వీరి కుటుంబ త్యాగాలు సమాజానికి తెలిపేవిధంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ కన్వీనర్ ఎగవింటి సుధాకర్,పట్టణ గౌరవ అధ్యక్షులు బెల్లం సుధాకర్,ప్రధాన కార్యదర్శి గజేంద్ర,నాయకులు ఉదయ్ కుమార్,ప్రసాద్,విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల విజయానికి కృతజ్ఞతగా సవితమ్మ దంపతులకు ఆశీర్వచనం



ఒంటిమిట్ట(ప్రజా సీమ) : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో చూపిన విశేష కృషికి కృతజ్ఞతగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ దంపతులకు ప్రత్యేక ఆశీర్వచన కార్యక్రమం విజయవాడలోని మంత్రివర్యుల స్వగృహంలో తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు సూచనల మేరకు భక్తి పరవశ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ మంత్రివర్యుల దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. బ్రహ్మోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులు తరలివచ్చినా, అన్ని శాఖల సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడంలో మంత్రివర్యులు ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు నాయకులు కొనియాడారు. రవాణా సౌకర్యాలు, తాగునీరు, భక్తుల నివాసం, భద్రత వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఉత్సవాల విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మరిన్ని సౌకర్యాల కల్పన, రహదారుల మెరుగుదల వంటి అంశాలను మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి, శ్రీనివాసరాజు, సీనియర్ నాయకుడు బొబ్బిలి రాయుడు, ఆలయ అర్చకులు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల విజయానికి గుర్తుగా నిర్వహించిన ఈ ఆశీర్వచన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సి.యం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్,ముక్కాసాయివికాష్ రెడ్డి





పుల్లంపేట(ప్రజా సీమ) : పుల్లంపేట మండలంలో ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే అరవ శ్రీధర్,ముక్కా సాయివికాష్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండలఅధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు కలిసి పంపిణీ చేశారు.ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, మరియు అభివృద్ధి బాగా జరుగుతున్నదని,పేదలుఅనారోగ్యంతో బాధపడి ఆసుపత్రిపాలై ఎక్కువ ఖర్చులు చేస్తున్న సమయములో వారికి ఆర్థిక సహాయం అంద జేయడం చాలా ప్రయోజనకరంగా ఉన్నదని తెలియజేశారు. చెక్కుల పంపిణీ వివరాలు రామక్కపల్లి కి చెందిన కోణంకి శంకరమ్మ కు 35,000, పుల్లంపేటకు చెందిన చింత గింజల గోపీనాథ్ కు35,437,కేతావాండ్లపల్లి కి చెందిన చింతావెంకటరెడ్డికి30,584, చెన్నయ్యగారి పల్లికిచెందిన నాగినేని సుందరమ్మకు10,000,యు.వెంకటం పల్లెకి చెందిన తాళ్లూరు ధనలక్ష్మి కి 37,527,జాగువారి పల్లికి చెందిన ఆకే పాటి నరసింహారెడ్డి కి 32,900, తిరుమలయ్య గారి పల్లి కి చెందిన చేని మధుశ్రీ కి 33,332 రూపాయలు చొప్పున చెక్కుల రూపంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలూరు కృష్ణమనాయుడు,కేశినేని నారాయణనాయుడు,పోలి జగదీశ్వర్ రెడ్డి,చుండు ఈశ్వర్ నాయుడు, వెంకటసుబ్బయ్యయాదవ్,ఆదినారాయణరెడ్డి, శంకర్ రెడ్డి,ద్వారకా గోపీనాథ్, కాకర్ల ప్రభాకర్ రావు, నాగరాజు యాదవ్,పోలు ప్రేమ కుమార్, మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీరాములపేటలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్





పుల్లంపేట(ప్రజా సీమ) : తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, శ్రీరాములపేట గ్రామంలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు “వజ్ర ప్రహర్” కార్యక్రమంలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టడం జరిగింది. రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు, అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పుల్లంపేట ఎస్సై చిన్న రెడ్డెప్ప, పెనగలూరు ఎస్సై రఘురామ్, ఓబులవారిపల్లి ఎస్సై పి. మహేష్, చిట్వేల్ ఎస్సై వినోద్ కుమార్, రైల్వే కోడూరు ఎస్సై ప్రసాద్ రెడ్డి మరియు రూరల్, టౌన్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, గృహాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, నిల్వ మరియు వినియోగాన్ని అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసులు తెలిపారు . గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు సమాజంలో నేరాల పెరుగుదలకు కారణమవుతున్నాయని. అందువల్ల వాటి నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలకు గంజాయి అమ్మకం, నిల్వ, వినియోగం చట్టవిరుద్ధమని అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఇక మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, దొంగతనాల నివారణపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు గంజాయి నిర్మూలనకు పోలీసు శాఖ ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించి గంజాయి రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.

# శ్రీ కాల గంగమ్మ తిరుణాల లో బండలాగుడు పోటీలు



ఒంటిమిట్ట(ప్రజా సీమ) : కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం మలకాటపల్లి క్రాస్ వద్ద చెరువు కట్టపైన వెలసిన శ్రీ కాల గంగమ్మ తిరుణాల మహోత్సవం సందర్భంగా ఆదివారం మూడు గంటలకు బండలాగుడు పోటీలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు గెలిచిన వారికి వరుసుగా సుబ్బారెడ్డి మొదటి బహుమతి 60000 రెండవ బహుమతి కూండ్ల ఓబుల్ రెడ్డి40 వేలు మూడో బహుమతి మోదుగుల రామ నర్సింహులు 30000 మోదుగుల చిన్న నరసింహులు తిరుపాలు కలిసి 20000 తేలూరు వెంకట శేషారెడ్డి 10000 ఆయపాటి నారాయణ 5000 అందిస్తున్నారు ఆసక్తి గలవారు పాల్గొనాలని తెలియజేస్తున్నారు.

నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# పసుపు "మోహానా"


**- పార్టీ కి 44,ఆయనకు 43 - నాటి నుండి నేటి దాకా పసుపు జెండా నే**
**- నాయకుడు ఎవరైనా సేవలు సైకిల్ కే**
**- 1984 నుండి 2026 వరకు సైకిల్ సేవలో శనివరపు మోహన్ రెడ్డి**









ఏపీ బ్యూరో(ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ లో అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో ఆనాటి నుండి నేటి వరకు పనిచేస్తున్న అతి కొద్ది మంది నాయకులలో ఆయన ఒకరు. 1984లో మొదటిసారి తెలుగుదేశానికి ఓటు వేసిన 2024లో కూడా అదే పార్టీకి ఓటు వేసి కాలం ఏదైనా, నాయకులు ఎవరైనా, ఎన్నిక ఏదైనా తన ఓటు, సేవలు కేవలం సైకిల్ కి మాత్రవే అని నిరూపించుకుంటున్నారు సిద్ధవటం మండలం జ్యోతి గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి. తెలుగుదేశం పార్టీ వయసు 44 సంవత్సరాలు అయితే తెలుగుదేశం పార్టీలో ఆయన వయస్సు 43 సంవత్సరాలు. నేటికీ పార్టీ కోసం పని చేస్తూ ఈ నలభై మూడు ఏళ్లలో పదేళ్లు టిడిపి మండల రైతు సంఘం అధ్యక్షుడిగా, పదేళ్లు టిడిపి మండల అధ్యక్షునిగా సేవలు అందించి నేటికీ సైకిల్ పార్టీ కోసం పచ్చ కండువా కప్పుకొని సిద్ధవటం మండల అభివృద్ధి కోసం అర్జీలు చేత పట్టుకొని అధికారుల వద్దకు నాయకుల వద్దకు తిరుగుతూ తన అగ్రెసివ్ వాయిస్ తో పార్టీ కార్యక్రమాలతో పాటు సమస్యలను కూడా ఎత్తిచూపుతున్నారు మోహన్ రెడ్డి.

**జ్యోతి నుండి రాజధాని దాకా**

సిద్ధవటం మండలం జ్యోతి గ్రామం నుండి రాష్ట్ర రాజధాని దాకా పార్టీ ఆవిర్భావం నుండి ఉన్న నాయకులతోపాటు నేటి నాయకులకు కూడా సుపరిచితం మోహన్ రెడ్డి. ఎంతోమంది సామాన్య కార్యకర్తలు కూడా గొప్ప నాయకులుగా ఎదిగిన తెలుగుదేశం పార్టీలో దాదాపు 43 ఏళ్లు పార్టీలో ఉంటూ నేటికీ సిద్ధవటం మండలంలోని తన చిరకాల వాంఛ అయిన ఖాదర్ బంగ్లా బ్రిడ్జి నిర్మాణం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు. నాడు ఎన్టీ రామారావు శంకుస్థాపన చేసిన బ్రిడ్జి ను పూర్తి చేస్తే కడప పోరుమామిళ్ల మధ్య రవాణా వ్యవస్థ బాగుపడుతుందని ఇప్పటికీ ఆ బ్రిడ్జిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ దృష్టి కి తీసుకు వెళ్తూ పని పూర్తయ్యే వరకు వదిలేదే లే అంటూ తన ప్రయత్నాలతో నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారు.

**మొండితనం, తెలుగుతనం ఆయన ప్రత్యేకత;**

ఎవరు ఎన్ని చెప్పినా తను అనుకున్నది సాధించేందుకు మోహన్ రెడ్డి చూపే మొండితనం, అచ్చమైన పంచ కట్టులో అసలైన తెలుగుదేశం పార్టీ తెలుగుదనం ను కలగలిపి మోహన్ రెడ్డి రాజకీయ ప్రయాణం నేటికీ ముందుకు కొనసాగుతుంది. దాదాపు 43 ఏళు ్లగా పార్టీలో కొనసాగుతూ మండల స్థాయిలో వివిధ హోదాల్లో 20 ఏళ్లు పనిచేసిన ఆయనకు భవిష్యత్తులో పార్టీలో గొప్ప స్థానం లభిస్తుందని టిడిపి శ్రేణులు ఆశిస్తున్నాయి.

**ప్రాణం పోయే వరకు టిడిపి తోనే**

తనకు రాజకీయాలు తెలిసినప్పటినుండి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నానని, నేటికీ తెలుగుదేశం పార్టీలోనే ఉన్నానని, తనకు ఎన్నికతో పని లేకున్నా తన ఓటు,సేవలు మాత్రం సైకిల్ గుర్తుకే ఉంటాయని, తాను తెలుగుదేశం పార్టీలో రైల్వే స్టేషన్లో ప్లాట్ ఫామ్ లాంటి వాడినని,మిగిలిన నాయకులు రైళ్లు లా వస్తూ పోతా ఉన్న తాను మాత్రం తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ సేవలందిస్తానని, అందుకే పదవుల కంటే పార్టీ ముఖ్యమని, పార్టీ ద్వారానే సిద్ధవటం మండల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భవిష్యత్తులో పార్టీ గెలుపుకు తన శాయ శక్తుల కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. మొత్తానికి సిద్ధపటం మండలం నుండి రాష్ట్రంలో ఉన్న ప్రతి నాయకుడు గుర్తించేలా శనివరపు మోహన్ రెడ్డి తెలుగుదేశం లో పార్టీ కంటే ఒక ఏడాది చిన్నవాడు.

మరి ఈ ఏడాది చిన్నవాడికి భవిష్యత్తులో పెద్ద పదవి లభిస్తుందేమోనని ఎదురు చూడాలి. ఎందుకంటే పార్టీలో నిజమైన నాయకులకు కార్యకర్తలకు ప్రథమ ప్రాధాన్యత అని నారా లోకేష్ ఇటీవల ప్రకటించిన సందర్భంలో శనివరపు మోహన్ రెడ్డి కి గౌరవప్రదమైన పదవి కేటాయిస్తే నమ్ముకున్న నాయకులకు గౌరవం దక్కినట్లు అవుతుందనీ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# మంత్రి లోకేష్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసిన రేపన బాబు






మదనపల్లె (ప్రజా సీమ): కర్ణాటక రాజధాని బెంగళూరుకి విచ్చేసిన ఏపీ ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుని తంబళ్లపల్లి నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనేత రేపన బాబు హెచ్.ఏ.ఎల్ విమానాశ్రయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాతో ఘనంగా సన్మానించారు.ప్రస్తుతం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై ఆయన ఆరా తీశారు.ఈ సందర్భంగా రేపన బాబు మాట్లాడుతూ మంత్రి తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని,యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారన్నారు. మంత్రి లోకేష్ బాబు ఎంతో సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని కొనియాడారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుకు నారా లోకేష్ చురుకుదనం తోడు కావడంతో ఏపీ సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపునిస్తామని,త్వరలోనే తంబళ్లపల్లి టిడిపిలో పరిస్థితులు చక్కదిద్దుతామని హామీ ఇచ్చారన్నారు.మంత్రి నారా లోకేష్ బాబును కలవడం తనకెప్పుడూ ప్రత్యేకమేన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు తుమ్మచెట్లపల్లి పి.సురేంద్ర పాల్గొన్నారు.

# నూకనపల్లిలో వైభవంగా సీతారాముల కళ్యాణం







ఓబులవారిపల్లి (ప్రజా సీమ) : శ్రీరామ నవమి ఉత్సవాలను శనివారం మండల పరిధిలోని నూకనపల్లి గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు.. గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయమును అరటి బోధుల తోనూ, మామిడి తోరణాలతోనూ సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆసనం పై శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహములను సుందరంగా అలంకరించి కొలువు దీర్చారు. అనంతరం వేదమంత్రాలతో ఆలయ పూజారి శాస్త్రోత్తకంగా సీతారాముల కళ్యాణం అత్యంత వేడుకగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్నంత సేపు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం తిలకంచి తన్మయత్వంతో పులకించిపోయారు. మండల టిడిపి యువ నాయకులు ఇండ్లూరి రాజమోహన్ రెడ్డి లక్ష్మీదేవి దంపతులు నిర్వహించిన ఈ కళ్యాణం అధ్యంతం కర్నూలు పండుగగా కొనసాగింది. కళ్యాణం అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ ప్రజల సహకారంతో కళ్యాణం వేడుకలలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అదేవిధంగా కళ్యాణమూర్తులకు కన్నుల పండువగా వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కళ్యాణమూర్తులను ట్రాక్టర్ పై ప్రత్యేకంగా ఆసనం ఏర్పాటు చేసి కొలువు తీర్చి సుందరంగా అలంకరించారు. స్వామివారి గ్రామోత్సవంలో భాగంగా దేవ దేవేరులు తమ గృహం వద్దకు వచ్చిన సమయంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామివారికి కాయ, కర్పూరం, ప్రసాదం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదే సమయంలో యువత రంగవల్లులతో ఆనంద కేళి నిర్వహించుకున్నారు. గ్రామోత్సవం వెంట భజన బృందం నిర్వహించిన భక్తి పాటలు అలరించాయి.. ఈ ఉత్సవాలతో నూకనపల్లి గ్రామం లో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది.

# వీ.హెచ్.పి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి

**- ఘనంగా నివాళులర్పించిన నాయకులు**



మదనపల్లె (ప్రజా సీమ) : విశ్వహిందూ పరిషత్ మదనపల్లి జిల్లా ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని శనివారం నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్ యార్డు వద్ద గల

ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ అన్నమయ్య మదనపల్లి జిల్లా అధ్యక్షులు గట్టి రామ్మోహన్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సేవలను వివరించారు.సమాజంలోని కులవివక్షను నిర్మూలించేందుకు,మహిళల విద్యాభివృద్ధికి,మరియు సామాజిక సమరసత కోసం ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు.సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ పూలే ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మదనపల్లి పరిషత్ కార్యదర్శి సోంపల్లి సురేష్ బాబు,రమణారెడ్డి,పోలూరు సుధాకర్,నాగప్రసాద్ నాయుడు,రెడ్డయ్య,రామ్మూర్తి,రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏపీపీగా మహమ్మద్ అయూబ్ నియామకం శుభసూచకం

**- కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె.బాషాచే సన్మానం**



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ప్రభుత్వం తరపున సివిల్ కేసులను పర్యవేక్షించడానికి,అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా (ఎపిపిగా) న్యాయవాది మహమ్మద్ అయూబ్ ను నియమించడం జరిగింది.ఈ సందర్భంగా శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయం నందు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.బాషా మర్యాదపూర్వకంగా కలసి, శాలువ కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈయన మూడు సంవత్సరాల కాలం పాటు కొనసాగుతారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ కె బాషా మాట్లాడుతూ ఏపిపిగా అయూబ్ తన వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వహించి,ప్రభుత్వ పక్షాన న్యాయ ప్రక్రియలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ జాతీయ తెలుగుదినపత్రిక



# సినిమా న్యూస్



## ఒకరితోనే డేటింగ్ అతడితోనే పెళ్లి!



ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి వ్యక్తిగత జీవితంపై పూర్తి క్లారిటీతో ఉందా? అంటే అవుననే అనాలి. నేటి తరం యువత డేటింగ్ సంస్కృతిపై భిన్నమైన అభిప్రాయాలతో ఉన్నప్పటికీ కృతి మాత్రం పాత తరం విలువలకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పుకొచ్చింది. తాను ఎవరితోనైనా డేటింగ్ చేస్తే? అది కేవలం పెళ్లి కోసమే ఉంటుందని ఒకరితోనే ప్రేమ.. అతడితోనే జీవితం అనే సూత్రాన్ని తాను నమ్ముతానని వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు ఆమెలోని పరిణతిని, సంప్ర దాయాల పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతున్నాయి. ప్రేమ , పెళ్లి విషయంలో కృతి శెట్టికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉన్నట్లు కనిపిస్తుందని ఆమె మాటలతో అర్దమవుతుంది.ప్రస్తుతానికి కృతిశెట్టి దృష్టి సినిమాలపైనే ఉందని మరో ఐదేళ్ల వరకు ప్రేమ లేదా పెళ్లి అనే ఆలోచనే తన దరిదాపుల్లోకి రాదని స్పష్టం చేసింది. ఐదేళ్ల తర్వాత మాత్రమే తన వ్యక్తిగత జీవితం గురించి ఒక నిర్ణయం తీసుకుంటానని అప్పటి వరకు తన శక్తిని, సమయాన్ని నటనకే కేటాయిస్తానని పేర్కొంది. ప్రేమ అనేది ఒక బాధ్యత అని సరదా కోసం చేసే పని కాదని కృతి అభిప్రాయపడింది. తాను పెళ్లాడబోయే వ్యక్తి తనను అర్థం చేసుకునేవాడై, తన వృత్తిని గౌరవించే వాడై ఉండాలంది. డేటింగ్ పేరుతో సమయాన్ని వృధా చేయడం కంటే ఒకే వ్యక్తితో బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడమే ఉత్తమమని అమ్మడు నమ్ముతోంది. గ్లామర్ ప్రపంచంలో ఉంటూ ఇంతటి స్థిరమైన ఆలోచనలు కలిగి ఉండటం విశేషం. కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి స్పష్టత ఉండటం వల్ల వృత్తిపరంగా ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉంది. చాలామంది నటీమణులు కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు రూమర్ల బారిన పడుతుంటారు. అయితే కృతి శెట్టి ముందే ఇలాంటి ప్రకటన చేయడం ద్వారా అనవసరమైన గాసిప్స్‌కు చెక్ పెట్టినట్లయింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లోనూ అవకాశాలు దక్కించుకుంటున్న మంగళూరు భామ నటనతో ప్రేక్షకులను మెప్పించడమే పరమావధిగా భావిస్తుంది. కృతి శెట్టి కెరీర్ పై ఉన్న స్పష్టతతో ఇటు నిర్మాతలకు, అటు అభిమానులకు ఒకరకమైన భరోసా ఇచ్చినట్లే. ఐదేళ్ల పాటు కేవలం వెండితెరపైనే కనిపిస్తానని చెప్పడం ఆమె అంకితభావాన్ని సూచిస్తోంది.


## ఆ స్టార్ హీరోకి జోడీగా సాహో బ్యూటీ!



బాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో విక్కీ కౌశల్. ప్రస్తుతం ఆయన అమర్ అశ్వత్థామ వంటి పౌరాణిక - చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే -మహావతార్- అనే భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించబోతున్నారు. ఈ సినిమాలో విక్కీ కౌశల్ సరసన నటించేందుకు శ్రద్ధా కపూర్‌తో చిత్ర బృందం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ప్రచారంతో అభిమానుల్లో సరికొత్త కాంబినేషన్ పై ఆసక్తి నెలకొంది. ఇప్పటి వరకూ విక్కీ కౌశల్ - శ్రద్ధా కపూర్ ఇంతవరకు వెండితెరపై కలిసి నటించలేదు. ఇద్దరూ తమదైన శైలిలో నటనను పండించగల ప్రతిభావంతులు.

-సాహో- చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైన శ్రద్ధ గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేయడంలో దిట్ట. విక్కీ కౌశల్ పీరియాడిక్ లుక్స్‌లో పరకాయ ప్రవేశం చేస్తారనే పేరుంది. ఈ నేపథ్యంలో ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే ఆ కెమిస్ట్రీ వెండితెరపై అద్భుతమైన మ్యాజిక్‌ను క్రియేట్ చేయడానికి అవకాశం ఉంది. -మహావతార్- చిత్రం భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. ఇదొక చారిత్రక నేపథ్యం ఉన్న కథ కావడంతో పాత్రల ఎంపిక విషయంలో దర్శకుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శ్రద్ధా కపూర్ తనదైన రాజసంతో ఈ చిత్రంలోని పాత్రకు పూర్తి న్యాయం చేస్తుందని భావించి ఆమెను సంప్ర దించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక చర్చలు ముగిశాయని త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల సమాచారం. సాధారణంగా పెద్ద సినిమాల్లో కొత్త కాంబినేషన్లు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రొటీన్ జంటల కంటే ఎప్పుడూ చూడని నటీనటులు కలిసి నటిస్తే ఆ సినిమాకు వచ్చే క్రేజ్ వేరుగా ఉంటుంది. విక్కీ కౌశల్ సీరియస్ పర్ఫార్మెన్స్‌కు శ్రద్ధా కపూర్ చరిష్మా తోడైతే అది సినిమాకు విజువల్ పరంగా , మార్కెట్ పరంగా ప్లస్ అవుతుంది. ఈ ప్రాజెక్ట్ ఖరారైతే ఏడాది బాలీవుడ్ నుండి రాబోయే క్రేజీ చిత్రాలలో ఇదొకటిగా నిలుస్తుంది. -మహావతార్- చిత్రం విక్కీ - శ్రద్ధా కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. కొత్త కాంబినేషన్లను ఇష్టపడే ప్రేక్షకులకు చిత్రం ఒక విందులా మారుతుంది. పర్ఫెక్ట్ కాస్టింగ్ కుదిరినప్పుడే సగం విజయం లభిస్తుందని నమ్మే మేకర్స్ ఈ జోడీని వెండితెరపై ఎలా ఆవిష్కరిస్తారో చూడాలి. శ్రద్ధా కపూర్ సైతం ఈ ప్రాజెక్ట్ పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అమ్మడు రెండేళ్లగా ఎలాంటి సినిమాలు చేయని సంగతి తెలిసిందే. భారీ విజయాలు అందుకున్న నేపథ్యంలో కథల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో -మహావతార్- లాంటి ప్రాజెక్ట్ లో ఛాన్స్ ఖరారైతే? తాను అనుకున్నది సాధించినట్లే.

## అతి ఫెమినిజం సమాజాన్ని పాడుచేసింది.. వివాదంపై నోరా క్లారిటీ



వరుస వివాదాల్లో నోరా ఫతేహి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఐటమ్ పాటల స్పెషలిస్ట్, డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి గతంలో ఫెమినిజం పై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. అయితే ఇటీవల ఒక అంతర్జాతీయ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివాదంపై పూర్తి స్థాయిలో క్లారిటీ ఇచ్చారు. తన మాటలను సోషల్ మీడియాలో చిన్న చిన్న క్లిప్పులుగా కత్తిరించి వక్రీకరించారని, దీనివల్ల తాను చెప్పదలుచుకున్న అసలు అర్థం మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ విషయంలోనైనా అతివాదాన్ని లేదా తీవ్రవాదాన్ని తాను వ్యతిరేకిస్తానని, తన పోరాటం మహిళా హక్కులకు వ్యతిరేకం కాదని నోరా స్పష్టం చేశారు. కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ..నోరా తన వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగాలను ప్రస్తావిస్తూ.. ఒక చిన్న కుటుంబంలో తల్లిదండ్రులిద్దరి సంరక్షణలో పెరగడం పిల్లల ఎదుగుదలకు ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. తాను ఒక సింగిల్ మదర్ వద్ద పెరగడం వల్ల చిన్నతనంలో తండ్రి లేని లోటును అనుభవించానని.. అటువంటి భావోద్వేగ గాయాలు పెద్దయ్యాక కూడా వ్యక్తిత్వంపై ప్రభావం చూపుతాయని నిజాయితీగా అంగీకరించారు. అందుకే ప్రతి బిడ్డకు తల్లిదండ్రుల ప్రేమ, క్రమశిక్షణ అందాలని నోరా ఆకాంక్షించారు. మహిళా స్వయం ప్రతిపత్తి.. భాగస్వామ్యం మధ్య ఉండాల్సిన అండర్ స్టాండింగ్ గురించి నోరా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలు కచ్చితంగా ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని.. వారి కలలను నెరవేర్చుకోవాలని కోరుకుంటూనే జీవితంలో ఒక తోడు ఉండటం తప్పేమీ కాదని అన్నారు. --మాకు ఎవరి అవసరం లేదు-- అనే ధోరణి కంటే.. స్వతంత్రంగా ఉంటూనే ఒకరికొకరు తోడుగా ఉండటం గొప్ప విషయమని నోరా పేర్కొన్నారు. అలాగే సమాజంలో పురుషులు కూడా మరింత జవాబుదారీతనంతో మెదలాలని.. వారు బాధ్యతాయుతమైన భాగస్వాములుగా ఉండాలని సూచించారు. అతి ఫెమినిజాన్ని తాను సహించనని కూడా నోరా అన్నారు. అలాగే పురుషులు ఇంటిని పోషిస్తే, మహిళలు ఆ ఇంటిలో ఉంటూ సంరక్షించాలనే పురాతన విధానాన్ని తాను సమర్థిస్తానని వ్యాఖ్యానించారు. అలాగే మహిళలు మంచి ఉద్యోగం చేస్తూ ఇంటి బాధ్యతలు నిర్వర్తించాలని కూడా అన్నారు. అయితే ఫెమినిజానికి వ్యతిరేకంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని కొందరు మహిళలు సోషల్ మీడియాల్లో విరుచుకుపడ్డ తర్వాత ఈ వివాదం రాజుకుంది. ప్రస్తుత కెరీర్ విషయానికి వస్తే.. నోరా అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతున్నారు. ఇటీవల ఈ భామ విడుదల చేసిన -వాట్ డు ఐ నో?- అనే సింగిల్ గ్లోబల్ చార్ట్స్‌లో ట్రెండ్ అవుతోంది. అంతేకాకుండా అమెరికాలోని ప్రసిద్ధ -ది టునైట్ షో విత్ జిమ్మీ ఫాలన్-లో ప్రదర్శన ఇచ్చి అంతర్జాతీయ గుర్తింపు పొందిన అతికొద్ది మంది భారతీయ తారల్లో ఒకరిగా నిలిచారు. తెలుగు సినిమాల విషయానికి వస్తే.. గతంలో బాహుబలి, టెంపర్ వంటి చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ తో గుర్తింపు పొందారు. సరైన స్క్రిప్ట్ దొరికితే టాలీవుడ్‌లో పూర్తి స్థాయి పాత్రలు చేయడానికి నోరా ఆసక్తిగా ఉన్నారు. సినిమాలతో పాటు రియాలిటీ షోల రంగంలో నోరా ఒక వెలుగు వెలుగుతున్నారు. ఝలక్ దిఖ్‌లా జా, ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్, హిప్ హాప్ ఇండియా వంటి పాపులర్ షోలకు జడ్జిగా వ్యవహరిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. తనదైన డ్యాన్స్ శైలి.. స్పష్టమైన అభిప్రాయాలతో బుల్లితెరపై తనదైన ముద్ర వేస్తున్నారు. కేవలం ఐటమ్ సాంగ్స్ మాత్రమే కాకుండా.. కథానాయికగా -మడ్గావ్ ఎక్స్‌ప్రెస్- వంటి చిత్రాలతో తన నటనను కూడా నిరూపించుకుంటూ ప్రపంచ స్థాయిలో తానేంటో నిరూపిస్తున్నారు. కన్నడ చిత్రం కేడి- ది డెవిల్ లో నోరా ఫతేహి నటించారు. అలాగే లారెన్స్ మాస్టార్ కాంచన 4లోను నోరా నటిస్తోంది. కేడి ది డెవిల్ చిత్రంలోని ఒక వివాదాస్పద పాట కారణంగా నోరా ఫతేహి పేరు ఇటీవల మార్మోగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ పాటను యూట్యూబ్ నుంచి తొలగించారు.

## స్వర్గం కళ్ల ముందే బులుగు బికినీలో!

టాలీవుడ్ అందాల భామ ప్రగ్యా జైస్వాల్ ప్రస్తుతం మాల్దీవుల వెకేషన్‌లో విహరిస్తూ తన అభిమానులకు కనువిందు చేస్తోంది. నీలిరంగు బికినీలో సముద్రపు తీరాన దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ భామ దీనికి అందమైన క్యాప్షన్ ఇచ్చింది. --ప్యారడైజ్ నుంచి చివరి ఫోటో-- అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫోటోల్లో ప్రగ్యా తన గ్లామర్‌తో నెటిజన్లను కట్టిపడేస్తోంది. కేవలం విహారయాత్ర కోసమే కాకుండా.. అక్కడి రిసార్టులకు పెద్ద ఎత్తున ప్రమోషన్స్ చేస్తూ మాల్దీవుల పర్యాటకాన్ని తనదైన శైలిలో ప్రోత్సహిస్తోంది.



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma